సాక్షి
విజయనగరం

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



ఉపాధి భేష్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వేతనదారులకు కోట్లాది పనిదినాలు కల్పించింది. - 8లో



మరణ రేటు జీరో - 8లో

ప్రజారోగ్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమివ్వడంతో మలేరియా మరణాల రేటు జీరోగా నమోదైంది.



ఉద్యోగుల మధ్య వివాదం

రేగిడి మండలంలోని మునకలవలస గ్రామ సచివాలయ ఉద్యోగుల మధ్య శుక్రవారం వివాదం నెలకొంది. - 8లో

న్యూస్‌రీల్

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సహస్ర దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్రత్యేక వ్యయపరిశీలకుల పర్యటన

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనానిగం జిల్లాకు శనివారం రానున్నారు. శ్రీకాకుళం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 4 గంటలకు విజయనగరం చేరుకొని 7 గంటల వరకు కలెక్టర్‌తో పాటు వ్యయ పర్యవేక్షణ బృందాలతో సమీక్షిస్తారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ షేక్ శంకర్

సంతకవిటి: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో సంతకవిటి మండలం పి.జె.పేట వద్ద ఏర్పాటు చేసిన చేక్‌పోస్టులో శుక్రవారం ఎస్‌ఐ షేక్‌శంకర్ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. పాలకొండ, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన వాహనాలను నిశితంగా పరిశీలించారు. మద్యం, మాదక ద్రవ్యాలు, డబ్బు తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.

షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట



బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి ఆలయంలో భక్తులు సమర్పించిన పంచలోహ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురోహితుడు పిండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజలు అనంతరం భక్తుల పేరున పూజలుచేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విజయం మనదే..



అభిమాన నాయకులు నామినేషన్ వేసిన వేళ.. అశేష జనవాహిని ఉరకలెత్తే ఉత్సాహంతో వెంట సాగింది. మండే ఎండలో 'సంక్షేమ' నినాదాలు వినిపించింది. పోటీలో ఎవరు ఉన్నా గెలుపు మనదే అన్న ఆత్మవిశ్వాసం కనబరిచింది. విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి, గజపతినగరం, బొబ్బిలి, ఎస్.కోట అసెంబ్లీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ల పర్వం శుక్రవారం అట్టహాసంగా సాగింది. పార్టీ శ్రేణులు విజయ భరోసా కల్పిస్తూ అభ్యర్థులతో అడుగు కలిపాయి. అండగా నిలిచాయి.

- అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లు
- బొత్స నామినేషన్ ఘట్టంతో చీపురుపల్లిలో పండగ సందడి
- 'కోట'లో జనహోరు
- గజపతినగరం మనదే అన్న సంకేతం
- శంబంగి వెంట నడిచిన బొబ్బిలి వాసులు
- విజయనగరం పార్లమెంట్‌కు ఆరు, 7 అసెంబ్లీ స్థానాలకు 33 నామినేషన్లు దాఖలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సార్వత్రిక ఎన్నికల లోక్‌సభ, శాసన సభ నామినేషన్ల ప్రక్రియ జిల్లాలో ఊపందుకుంది. రెండోరోజున విజయనగరం పార్లమెంట్ స్థానానికి 6, అసెంబ్లీ స్థానాలకు 33 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏకాదశి రోజు మంచి ముహూర్తాన నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు ప్రాధాన్యమిచ్చారు. ముందుగా ఆలయాల్లో పూజలు చేసి, పెద్దల ఆశీర్వాదం తీసుకుని నామినేషన్ కేంద్రాలకు బయలుదేరారు. విజయనగరం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు మూడు సెట్లు, అదే పార్టీ అభ్యర్థిగా కలిశెట్టి రామలక్ష్మి రెండు సెట్లతో ఐదు నామినేషన్లు దాఖలు చేశారు. మరో నామినేషన్ స్వతంత్ర అభ్యర్థిగా పి.ఆనందసాగర్ రెండవ రోజున వచ్చింది. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి విజయనగరంలో 4, గజపతినగరంలో 8, చీపురుపల్లిలో 3, ఎస్.కోటలో 4, నెల్లిమర్లలో 6, రాజాంలో 2, బొబ్బిలిలో 6 మొత్తం 33 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

- విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి 4 నామినేషన్లు దాఖాలయ్యాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీసాల గీతకు ఆపార్టీ నుంచి టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్లు, ఇందిరా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సుంకరి సతీష్, స్వతంత్ర అభ్యర్థిగా దుడ్డు వెంకటరమణ నామినేషన్ దాఖలు చేశారు.
- సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజాం అసెంబ్లీ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలైనట్టు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎల్.జోషఫ్ తెలిపారు. కోండ్రు మురళీమోహన్ టీడీపీ తరఫున రెండు సెట్ల నామినేషన్లు వేశారు.
- నెల్లిమర్ల అసెంబ్లీ స్థానానికి రెండోరోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జనసేన అభ్యర్థి లోకం నాగమాధవి మూడు సెట్లు నామినేషన్ పత్రాలు అందజేశారు. బీఎస్పీ అభ్యర్థిగా ఎరుకొండ తేజారాణి, సమాజ్ వాది పార్టీ అభ్యర్థిగా కర్రి కృష్ణ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కె.జేయేస్ నామినేషన్లు సమర్పించారు. మొత్తంగా రెండోరోజు నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు తెలిపారు

బొత్స నామినేషన్‌కు తరలివచ్చిన జనం

వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణ నామినేషన్ ఘట్టం శుక్రవారం అట్టహాసంగా సాగింది. రెండువేల బైక్‌లతో ర్యాలీ.. వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో చీపురుపల్లి కాస్త జనసంద్రంగా మారింది. గరివిడి నుంచి చీపురుపల్లి వరకు జనహోరు సాగింది. మహిళలు హారతిచ్చి విజయతిలకం దిద్దారు. అవ్వాతాతలు ఆశీర్వచనాలు అందించారు. వేలాది మంది అభిమానుల నడుమ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.శాంతికు మూడుసెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు చీపురుపల్లి మూడురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బొత్స మాట్లాడుతూ త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు వేసే ప్రతీ ఓటు ప్రతిపక్షాలకు చెంప పెట్టు కావాలని, ప్రజలు మనసుతో ఆలోచన చేసి ఓటు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ నామినేషన్ ఘట్టానికి తరలివచ్చిన అభిమాన జనతరంగం, (ఇన్‌సెట్లో) చీపురుపల్లి ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ



గజపతినగరం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎం.వి.సూర్యకళకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య

జనాభిమానం సాక్షిగా..

జనాభిమానం సాక్షిగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనర్సయ్య నామినేషన్ వేశారు. ముందుగా అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం పార్టీ శ్రేణుల భారీ ర్యాలీ నడుమ గజపతినగరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారి ఎం.వి.సూర్యకళకు మూడుసెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే సతీమణి దేవీ అనూరాధ ఒక సెట్టు నామినేషన్ అందజేశారు. టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ రెండు సెట్లు అతని సతీమణి కొండపల్లి లక్ష్మీసింధు ఒక సెట్టు నామినేషన్‌ను ఆర్వోకు అందజేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన లెంక సూర్యారావు ఒక సెట్టు నామినేషన్ వేశారు.

బొబ్బిలిలో భారీ ర్యాలీ

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన కుమారుడు శ్రీకాంత్ మరో మూడు సెట్ల నామినేషన్లు వేశారు. మొత్తం ఆరుసెట్ల నామినేషన్లకు ఆరుగురు వ్యక్తులు ప్రతిపాదించారని ఆర్వో, ఆర్డీఓ ఎ.సాయిశ్రీ తెలిపారు. బొబ్బిలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణుల భారీ ర్యాలీ నడుమ శంబంగి నామినేషన్ వేసేందుకు తరలివచ్చారు. వేలాదిమంది కార్యకర్తలు, నాయకులు, అభిమానులు జై జగన్, జై శంబంగి నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు. సరికొత్త ఉత్సాహంతో ముందుకు సాగారు.



నామినేషన్ పత్రాలను ఆర్డీఓకు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి



బొబ్బిలి ప్రధాన రోడ్డులో శంబంగికి మద్దతుగా సాగుతున్న పార్టీ శ్రేణులు

'కోట'లో ఫ్యాన్ హోరు..

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు నామినేషన్ మన బాధ్యత అంటూ ఊరూవాడా కదలివచ్చింది. కొత్తవలసలోని తన ఇంటి నుంచి వేలాదిగా వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి ఎస్.కోటలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. దారిపొడవునా జగన్ నినాదాలు మిన్నంటాయి. సంక్షేమ పాలనకు అండగా ఉంటామంటూ మహిళలు హారతలిచ్చి ఆశీర్వదించారు. జగనన్న మాట ప్రకారం మా అందరికీ సంక్షేమ ఫలాలు అందజేశారని... మేము కూడా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తామని మాట ఇచ్చారు. అభిమాన నాయకుడికి మద్దతుగా కదలివచ్చారు. దేవీకూడలిలో ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు మాజీ ఎమ్మెల్యే హైమావతి, ఎమ్మెల్సీ కె.రవిబాబు, రాష్ట్ర వెలమ కార్పొరేసన్ చైర్మన్ ఎస్.నాయుడుబాబు, డీసీసీబీ చైర్మన్ వి.చినరామునాయుడు తదితరులు జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. 58 నెలల సంక్షేమ పాలనను వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కార్యక్రమంలో జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఏఎంసీ చైర్మన్ ఎం.కస్తూరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మోపాడ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, ఐదు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవి ఆలయంలో నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న కడుబండి శ్రీనివాసరావు



ఎస్.కోటలో నామినేషన్ వేసేందుకు అభిమానుల ర్యాలీ నడుమ వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు

జిల్లా వ్యయ పరిశీలకుల అధికారిక ఫోన్ నంబర్లు ఇవే..

- కంట్రోల్ రూమ్ నంబర్లు 08922-797120, 797124

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థుల వ్యయ పరిశీలనకు నియామకమైన అధికారుల ముగ్గురు ఫోన్ నంబర్లను జిల్లా యంత్రాంగం శుక్రవారం ప్రకటించింది. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన ఫిర్యాదులను ఆయా అధికారుల నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నంబర్లు 08922-797120, 797124కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అవసరమైన సమాచారాన్ని పొందవచ్చు.

ఫ్యాన్ గుర్తే శ్రీరామ రక్ష

- చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మరు
- సంక్షేమ, అభివృద్ధి పాలనకే ఓటు
- మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 58 నెలలపాటు సాగించిన సంక్షేమ, అభివృద్ధి పాలనను ప్రజలు స్వాగతిస్తున్నారు.. ప్రతీ కుటుంబానికి జరిగిన మేలును తలచుకుంటున్నారు.. ఫ్యాన్ గుర్తే శ్రీరామ రక్షగా భావిస్తున్నారు.. వచ్చేనెల 13వ తేదీన జరగనున్న పోలింగ్‌లో రెండు సార్లు ఫ్యాన్ గుర్తుకు ఎదురుగా బటన్ నొక్కి సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. చీపురుపల్లి ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. వారు ఏదైనా చేసి ఉంటే అదే విషయాన్ని ప్రజలకు చెప్పుకోవచ్చన్నారు. 14 ఏళ్లపాటు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలకు చేసినది శూన్యమన్నారు. ఎన్నికల వేళ.. ఏం చెప్పాలో తెలియక ఎల్లోమీడియాతో కలిసి అవాస్తవాలు, అబద్ధాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మే పరిస్థితి పోయిందన్నారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమం ప్రతీ పల్లె, ఇంటికి చేరిందన్నారు. అందుకనే దేశ చరిత్రలోనే ఏ సీఎం మాట్లాడని విధంగా ప్రతీ ఒక్కరి ఇంట్లో మేలు జరిగి ఉంటేనే ఓటు వేయమని చెప్పే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. చీపురుపల్లి నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కోట్ల వెంకటరావు తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణ

పక్కాగా ఎన్నికల ఖర్చు లెక్క

- ఇప్పటివరకు రూ.4.2 కోట్ల విలువైన నగదు, లిక్కర్, బంగారం తదితర వస్తువులు సీజ్
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో పార్లమెంట్, శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని వ్యయ పరిశీలకుల బృందం ప్రభాకర్ రాజన్, ఆనంద్‌కుమార్, ఆకాష్‌దీప్ ఎన్నికల అధికారులు, అకౌంటింగ్ బృందాలను ఆదేశించారు. కలెక్టర్‌తో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సహాయ వ్యయ పరిశీలకులు, స్టాటిస్టిక్ సర్వలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వలెన్స్, అక్కౌంటింగ్‌టీమ్, ఎంసీఎంసీ, ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ ఎక్స్ఛేంజర్ మానిటరింగ్ కమిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారం మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. సోషల్ మీడియా, టీవీ, పత్రికలలో వచ్చే ప్రకటనలను లెక్కగట్టి సంబంధిత అభ్యర్థుల ఖాతాల్లో ఖర్చును జమ చేయాలన్నారు. బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మార్చి 16 నుంచి నేటి వరకు రూ.92 లక్షల నగదు, రూ.42 లక్షల విలువైన లిక్కర్, 29 లక్షల విలువైన డ్రగ్స్, రూ.1.81 కోట్ల విలువైన బంగారం, వెండి వస్తువులు, రూ.74లక్షల విలువైన ఇతర సామగ్రిని సీజ్ చేసినట్టు వెల్లడించారు.

టీడీపీ శ్రేణులకు జనసేన అభ్యర్థి ఝలక్!

> 'నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతల 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని ఒక్క పూటలో నాశనం చేసిన జనసేన నాయకులకు శత కోటి వందనాలు.. జనాలను తీసుకొచ్చిన నాయకులకు చెప్పుదెబ్బలు కొట్టించినందుకు పాదాభివందనం. ఓటు అనుకొని గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు చెప్పులతో కొడతారు.'
> – ఇదీ ఓ 'పేట'కు చెందిన టీడీపీ నాయకుల ఆవేదన

> 'రాజకీయం చేయడమంటే సాఫ్ట్‌వేర్ జాబ్ చేసినంత ఈజీ కాదు.. ఇప్పుడు కనీసం ఆకలితో అలమటించేవారికి భోజనం పెట్టలేదు. రేపు జాబులు ఇస్తారంటే ఎలా నమ్మేది? మీకు శతకోటి దండాలు.. ఎంతో మంది కార్యకర్తలు వివిధ పనులు మానుకొని మండుటెండలో వస్తే ఇచ్చిన గౌరవం ఇదా...? మీరు జనానికి ఏం మేలు చేస్తారు?
> – ఇది మరో గ్రామ యువకుల ఆవేదన

- నామినేషన్ ఘట్టంలో ఘోర అవమానం
- కనీసం తాగునీరు అందించని వైనం
- భగ్గుమన్న టీడీపీ కార్యకర్తలు
- పార్టీనాయకులపై తిట్లపురాణం
- నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ శకం ముగిసిందంటూ ఆవేదన



మండే ఎండలో గొంతు తడుపుకునేందుకు ఫ్రూటీ, తాగునీటి ప్యాకెట్లకు ఎగబడుతున్న జనం

నెల్లిమర్ల రూరల్: అంతా చూసుకుంటాం.. నామినేషన్ ఘట్టానికి గ్రామాల నుంచి టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలంటూ నాలుగు రోజులుగా నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో జనసేన అభ్యర్థి లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. దీంతో ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు మాధవి నామినేషన్ ఘట్టంలో శుక్రవారం పాల్గొన్నారు. ఓ వైపు ఎండ భగ్గుమంటున్నా నెల్లిమర్లకు తరలివచ్చారు. మధ్యాహ్నం వేళ తాగునీరు, ఫ్రూటీల పంపిణీని ఆమె జనసేన కార్యకర్తలకు అప్పగించడం, వారు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. మీ మాట విని వచ్చామని, ఇక్కడకు వచ్చాక కనీసం తాగునీరు అందించలేదంటూ టీడీపీ నాయకులను కొందరు కార్యకర్తలు బహిరంగంగానే దుమ్మెత్తిపోశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ శకం ముగిసిపోనుందని చీవాట్లు పెట్టారు. నామినేషన్ వేసిన తర్వాత టీడీపీ నాయకులు, కార్యకర్తలను కనీసం పట్టించుకోకుండానే మాధవి కారులో వెళ్లిపోయారు. దీంతో పార్టీ నాయకులు అవాక్కయ్యారు. గ్రామాల నుంచి తీసుకొచ్చిన వారికి కొందరు నాయకులు చేతిచమురు వదిలించుకుని మర్యాదలు చేశారు.

క్లుప్తంగా

మీడియా కేంద్రాన్ని పరిశీలించిన వ్యయ పరిశీలక బృందం

విజయనగరం అర్బన్: ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రాన్ని వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ శుక్రవారం కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్ కమిటీ, సోషల్ మీడియా, జిల్లా వ్యయ అంచనాల కమిటీ, ఫిర్యాదులు, రిపోర్టింగ్ విభాగాలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారి విధుల గురించి అడిగి, రిజిస్టర్లను పరిశీలించారు. వాహనాల జీపీఎస్ సిస్టంను, మద్యం చెక్ పోస్టుల కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. అనంతరం మీడియా కేంద్రాన్ని సందర్శించారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు విజయ్‌కుమార్

బాడంగి: మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన తూముల విజయ్‌కుమార్(23) గురువారం పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ పార్వతీపురం ఆస్పత్రిలో చికిత్స పొందినా నయం కాకపోవడంతో నొప్పి తట్టుకోలేక విసిగిపోయి జీవితంపై విరక్తితో గ్రామానికి సమీపంలో గల అరటి తోట వద్ద పురుగు మందు సేవించాడు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు, స్నేహితుడు 108లో బొబ్బిలి ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి తూముల కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఆర్.జయంతి పర్యవేక్షణలో హెచ్‌సీ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బీరు బాటిళ్ల పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్‌ఐ, పట్టుబడిన వ్యక్తి

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ జంక్షన్ వద్ద వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో 12 బీరు సీసాలు పట్టుబడినట్లు వల్లంపూడి ఎస్.ఐ రాజేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో జంక్షన్‌లో తనిఖీ నిర్వహిస్తుండగా 12 బీరు సీసాలు పట్టుబడటంతో సీసాలతో పాటు వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలు రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

ఆటో ఢీకొని యువకునికి గాయాలు


గాయపడ్డ దిలీప్

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురానికి చెందిన రాజాన దిలీప్ ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే పనిపై పట్టణంలోని శ్రీకళాభారతి వెనుక గల రాతిపనివారి వీధి వెళ్లి డెలివరీ అనంతరం తిరిగి వస్తుండగా మెయిన్‌రోడ్డు మీదుగా తెర్లాం మండలం కూనాయవలసకు చెందిన మోది సింహాచలం నడుపుతున్న ఆటో ఢీకొనడంతో దిలీప్ గాయపడ్డాడు. వెంటనే దిలీప్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించగా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్టు ఏఎస్సీ జి.భాస్కరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

144 మద్యం బాటిళ్ల స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరం మండల పరిధి బియ్యాలపేట గ్రామ శివార్లలో అక్రమంగా తరలిస్తున్న 144 మద్యం బాటిళ్లను, ఒక బైక్‌ను రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వాసుదేవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పరిధిలో పద్మావతీనగర్ గాయత్రీ లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సాగర్‌బాబు, వన్‌టౌన్ ఎస్‌ఐ హరిబాబు నాయుడుల ఆధ్వర్యంలో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11 మొబైల్స్‌తో పాటూ రూ.50వేల 800ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

ఉపాధి భేష్

- ఐదేళ్లలో 12.32 కోట్ల పనిదినాలు
- వేతనాల కోసం వెచ్చించిన నిధులు రూ.2732.13 కోట్లు
- మెటీరియల్ నిమిత్తం ఖర్చు చేసింది రూ.816.48 కోట్లు
- ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకు లబ్ధి
- జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు
- వేతనదారులు 6.06 లక్షలు

2019 నుంచి 2024 మార్చి నెలఖారు నాటికి కల్పించిన పని దినాలు	
సంవత్సరం	పని దినాలు
2019–20	2.58 కోట్లు
2020–21	3.06 కోట్లు
2021–22	2.55 కోట్లు
2022–23	1.95 కోట్లు
2023–24	2.18 కోట్లు

సంవత్సరం	వేతనదారులకు చెల్లించింది
2019–20	రూ.563.18 కోట్లు
2020–21	రూ.731.85 కోట్లు
2021–22	రూ.527.78 కోట్లు
2022–23	రూ.406.55 కోట్లు
2023–24	రూ.502.77 కోట్లు

సంవత్సరం	మెటీరియల్ పనులకు వెచ్చించిన నిధులు
2019–20	రూ.62.12 కోట్లు
2020–21	రూ.312.70 కోట్లు
2021–22	రూ.198.00 కోట్లు
2022–23	రూ.114. 61 కోట్లు
2023–24	రూ.129.05 కోట్లు


గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో పని చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేతనదారులకు కోట్లాది పనిదినాలు కల్పించింది. ఫలితంగా జిల్లాలో వలసలు గణనీయంగా తగ్గాయి. ఐదేళ్ల కాలంలో ప్రతి గ్రామంలోను పెద్ద ఎత్తున పనులు కల్పించారు. గతంలో ఉపాధి లేక గ్రామాల్లో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం సొంతూళ్లలో పని కల్పించింది. దీంతో అధిక సంఖ్యలో వేతనదారులు పనులకు వెళ్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేతనాల చెల్లింపు కూడా సత్వరమే చెల్లిస్తున్నారు. దేశంలోనే విజయనగరం జిల్లా పని కల్పనలో ప్రథమంగా నిలిచింది. ప్రతి కుటుంబానికి 100 రోజులు పాటు ఈ పథకం ద్వారా పని కల్పిస్తారు. ఉన్న ఊళ్లలోనే పని దొరుకుతుంది. సాఫీగా జీవనం సాగిస్తున్నారు.

రూ.25వేల వరకు లబ్ధి



నాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. ప్రతి ఏటా ఉపాధి పనికి వెళ్తున్నాను. ఈ ఏడాది నాకు రూ. 25 వేలు వరకు లబ్ధి చేకూరింది. మా గ్రామంలోనే పని పెట్టడం వల్ల పనికి వెళ్తున్నాను. వేతనదారులకు పని కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం ఆనందంగా ఉంది. నాతో పాటు వందలాది మంది మా గ్రామంలో పనికి వస్తున్నారు.

– గాదల కృష్ణమ్మ, వేతనదారు, పెదవేమలి గ్రామం

వలసలు తగ్గాయి



నాది చీపురుపల్లి మండలం. ఉపాధి హామీ పథకం రాకముందు చాలా మంది హైదరాబాద్ విశాఖపట్నంకు పని కోసం వెళ్లేవారు. ఉపాధి పథకం వచ్చిన తర్వాత మా గ్రామంలోనే పని దొరుకుతుంది. డబ్బులు కూడా ప్రభుత్వం పని చేసిన వెంటనే జమ చేస్తుంది. దీంతో డబ్బులకు ఇబ్బంది లేదు. కుటుంబం అంతా సాఫీగా జీవనం సాగిస్తున్నాం.

– బనాన లక్ష్మి, వేతనదారు, చీపురుపల్లి మండలం

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వీటిలో 3.21లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో 6.06 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో 5.04 లక్షల మంది వేతనదారులు పనులకు వెళ్తున్నారు.

ఒక్కో వేతనదారుడికి రూ.25 వేల వరకు లబ్ధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లే వేతనదారుడికి వేలాది రుపాయిలు ఏటా అందుతున్నాయి. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ. 30 వేల వరకు లబ్ధి చేకూరుతుంది. ప్రతి ఏటా ప్రభుత్వం కోట్లాది పనిదినాలు వేతనదారులకు కల్పిస్తోంది. ఏడాదికి 2 కోట్ల నుంచి 3 కోట్ల వరకు పనిదినాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం రూ.500 నుంచి రూ.700 కోట్ల వరకు వేతనదారులకు ఏటా చెల్లిస్తున్నారు.

ఐదేళ్లలో 12.32 కోట్ల పనిదినాలు

2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 12.32 కోట్ల పనిదినాలు ప్రభుత్వం కల్పించింది. పనికి వచ్చిన వేతనదారులకు ఇప్పటి వరకు రూ.2732.13 కోట్లు వెచ్చించింది. మెటీరియల్ పనులకు సంబంధించి రూ.816.48 కోట్లు ఖర్చు చేసింది.

వేతనదారులకు గిట్టుబాటు వేతనం

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వచ్చే ప్రతి వేతనదారుడికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గరిష్ఠ వేతనం రూ.272 కాగా వేతనదారులకు రూ.240 నుంచి రూ.272 వరకు వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వేతనం రూ.300కు ప్రభుత్వం పెంచింది. వేతనాలు కూడా వారం రోజుల్లో జరుగుతుండడంతో వేతనదారులు ఉత్సాహంగా పనులకు వెళ్తున్నారు.

మరణ రేటు జీరో




పార్వతీపురం గిరిజన సంక్షేమ వసతిగృహంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఐదేళ్లలో జిల్లాలో మలేరియా కేసుల వివరాలు			
సంవత్సరం	రక్త పరీక్షలు	మలేరియా నిర్ధారణ	మరణాలు కేసులు
2019	280725	150	0
2020	186275	124	0
2021	259207	109	0
2022	263417	502	0
2023	264449	482	0
2024 (మార్చి వరకు)	72902	130	0

- ఫలించిన రాష్ట్రప్రభుత్వం చర్యలు
- విస్తృతంగా వైద్యారోగ్య కార్యక్రమాలు
- ఏటా రెండు విడతల్లో దోమల నివారణ మందు పిచికారీ
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- 410 మలేరియా పీడిత గ్రామాల గుర్తింపు క్రమం తప్పకుండా దోమతెరల పంపిణీ

పార్వతీపురంటౌన్: గతంలో గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ, పారిశుద్ధ్య కార్యక్రమాలు అంతంతమాత్రంగానే ఉండేవి. గిరిజనుల ప్రాణాలంటే గతంలో పాలకులకు లెక్క ఉండేది కాదు. 2012 నుంచి 2018 వరకు జిల్లాలో మలేరియా తీవ్రత అధికంగా ఉంది. మరణాలు కూడా ఎక్కువగా నమోదయ్యేవి. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో జీవించే ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా కలిగింది. సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్యారోగ్య కార్యక్రమాలను విస్తృతం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి 50 కుటుంబాలకు గ్రామ వలంటీర్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ యంత్రాగం పలు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేసింది. మరోవైపు దోమల నివారణకు మలేరియా, వైద్యారోగ్యశాఖ బృందాలు నిరంతరం పనిచేశాయి.

జిల్లావ్యాప్తంగా 4,42,400 దోమతెరలు

2022లో జిల్లావ్యాప్తంగా 4,42,400 దోమతెరలను ప్రభుత్వం పంపిణీ చేసింది. దోమతెరల వినియోగంపై వైద్యబృందాలు, సచివాలయ ఉద్యోగులు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు వ్యాధుల సీజన్‌గా ప్రభుత్వం గుర్తించి వైద్యారోగ్య కార్యక్రమాలను చేపడుతోంది. 2019 నుంచి నుంచి దోమల నివారణతో పాటు మలేరియా తీవ్రతను అరికట్టడంలో మలేరియా, వైద్యారోగ్యశాఖలు ఎంతో శ్రమించాయి. ప్రతి ఏడాది రెండు దఫాలుగా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నాయి. ప్రతి గ్రామంలో ఇంటి లోపల, బయట దోమల మందు పిచికారీని తప్పనిసరిగా చేయించాలనే నిబంధనను సచివాలయ ఉద్యోగులు అమలు చేశారు. గ్రామ వలంటీర్లు తమకు నిర్దేశించిన గిరిజన కుటుంబాల నివాసాల వద్ద దగ్గరుండి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఇంటింటా ఫీవర్ సర్వే విజయవంతంగా నిర్వహించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్యసిబ్బంది వెంటనే రక్త పరీక్షలు చేసేవారు. మలేరియా, ఇతర జ్వరాలను నిర్ధారించి సకాలంలో వైద్యసేవలు అందించడంతో జ్వరపీడితులు కోలుకున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలించడంతో మలేరియా వ్యాధి బారిన పడి ఎవరూ మృతి చెందలేదు.

401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించాం



జిల్లా వ్యాప్తంగా 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించాం. గ్రామాల్లో మలేరియా కేసులు నమోదైనా అక్కడ కూడా వైద్యబృందాలను అప్రమత్తం చేస్తున్నాం. దోమల నివారణ చర్యలతో పాటు సంపూర్ణ పారిశుద్ధ్యానికి డ్రైడే నిర్వహిస్తున్నాం. మలేరియా కేసులు నమోదవుతునప్పటికీ సకాలంలో వైద్యసేవలు అందించడంతో ఈ ఐదేళ్లలో ఆ వ్యాధితో మరణాలు నమోదు కాలేదు.

– డాక్టర్ టి. జగన్మోహన్ రావు, డీఎంఓ, పార్వతీపురం మన్యం


దోకిశీలలో డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

'మే 15 నుంచి దోమల నివారణ మందు పిచికారీ

ఈఏడాది కూడా దోమల నిర్మూలన కార్యక్రమాలకు మలేరియా, వైద్య ఆరోగ్యశాఖలు చర్యలు చేపట్టాయి. ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించింది. ఈ మేరకు జిల్లాలో 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించి మే 15 నుంచి మొదట విడత దోమల నివారణ మందు పిచికారీని జిల్లా మలేరియాశాఖ ప్రారంభించనుంది.

మునకలవలస సచివాలయంలో ఉద్యోగుల మధ్య వివాదం


మునకలవలస సచివాలయంలో ధ్వంసమైన కుర్చీలు

రేగిడి : మండలంలోని మునకలవలస గ్రామ సచివాలయ ఉద్యోగుల మధ్య శుక్రవారం వివాదం నెలకొంది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కె.సత్యనారాయణ తనకు జీతం బిల్లును పంచాయతీ కార్యదర్శి పి.సుధీర్‌కుమార్ పెట్టకపోవడంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు గ్రామస్తులు వెల్లడించారు. సచివాలయంలో వీరిద్దరు పరస్పరం వాదోపవాదనలు చేసుకుని, చివరికి సచివాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. గతంలో వీరిద్దరి మధ్య వ్యక్తిగత విభేదాలు కూడా ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, పంచాయతీ కార్యదర్శితో పాటు డిజిటల్ అసిస్టెంట్ వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. గ్రామస్తులతో పాటు మండల పరిషత్ అధికారులు వద్ద ఈ వివాదానికి సంబంధించి వివరాలు ఆరా తీస్తున్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లి గ్రామంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి తొమ్మిది మందిని కరిచి తీవ్రంగా గాయపరిచింది. గ్రామంలోని యాత వీధిలో ఆరు బయట ఉన్న వారిపై కుక్క విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచింది. స్థానికులు వెంటబెట్టగా అక్కడ నుంచి జాతీయ రహదారికి ఆనుకోని ఉన్న టీ పాయింట్‌కు సమీపంలో మరి కొంత మందిపై దాడి చేసింది. అక్కడ నుంచి జాతీయ రహదారి పక్కన తాటి ముంజెలు విక్ర యిస్తున్న వారితో పాటు, రోడ్డు పక్కన లారీని ఆపి ఉంచిన డ్రైవర్‌పై కూడా దాడి చేసింది. ఈ ఘటనల్లో గ్రామానికి చెందిన పి.అచ్చియ్యమ్మ, బి.కృష్ణమ్మ, బి.సంతోష్, కె.సురేష్, పి.రామలక్ష్మి, వై.సన్యాసిలకు తీవ్ర గాయాలు కాగా, బొండపల్లిలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. బొండపల్లి పీహెచ్‌సీలో నీలాతి రాము, పురం రామలక్ష్మి, ఎర్ర సన్యాసిలు చికిత్స పొందుతున్నారు.

జనం.. నీరాజనం


చీపురుపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా పిల్లపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ


విజయనగరం: నగరంలోని 15వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల తదితరులు

సార్వత్రిక ఎన్నికలకు ప్రకటన వెలువడడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారానికి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. జగనన్న పాలనలో పొందిన మేలును గుర్తించి అభ్యర్థుల వెనుక ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేస్తామంటూ నినదిస్తున్నారు. దీంతో అభ్యర్థులు మరింత ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


గజపతినగరం రూరల్ : రామన్నపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్యకు హారతులు పడుతున్న మహిళలు


భోగాపురం: మండలం సుందరపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘుబాబు తదితరులు